క్లుప్తంగా

సీసీరోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని 21వ వార్డులో చేపడుతున్న అంతర్గత సిమెంట్‌రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ కేవీ శ్రావణ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. నాణ్యతో పనులు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ అబ్దుల్లా, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

టీడీపీ నాయకులకు పోలీసుల నోటీసులు



వరికుంటపాడు: టీడీపీ మంగళవారం తలపెట్టిన ఛలో కావలి కార్యక్రమానికి అనుమతి లేనందున ఎవరూ వెళ్లరాదని వరికుంటపాడు ఎస్సై బాలమహేంద్రనాయక్ తెలిపారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని టీడీపీ నాయకులకు సోమవారం ముందస్తు నోటీసులు జారీచేశారు. కావలిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ర్యాలీలు, సభలు, ధర్నాలపై నిషేధం విధించినట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా వెళితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అర్హులందరికీ భూములు



మర్రిపాడు: మండలంలోని అర్హులైన వారందరికీ భూములు పంపిణీ చేస్తామని తహసీల్దార్ హేమంత్‌కుమార్ తెలిపారు. ఈర్లపాడు పంచాయతీలో భూపంపిణీపై సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అర్హులైన పేదలను గుర్తించి వారికి భూములు అందించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అర్హులైన పేదలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మళ్లీ గ్రామసభ నిర్వహించి అర్హులను గుర్తించి ప్రభుత్వం ద్వారా భూములను పంపిణీ చేస్తామని తెలిపారు.

ఫాగింగ్‌పై అవగాహన



మర్రిపాడు: దోమల నివారణకు ఫాగింగ్ మందు మర్రిపాడు పీహెచ్‌సీలో అందుబాటులో ఉందని వైద్యాధికారి కల్పన తెలిపారు. మర్రిపాడు పీహెచ్‌సీలో దోమల నివారణకు ఫాగింగ్ మెషిన్ వాడే విధానంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 17 సచివాలయాల పరిధిలో పంచాయతీ కార్యదర్శులు సాయంత్రం వేళ దోమల నివారణకు లీటర్ డీజిల్‌కు 7మి.లీ. ఫైత్రోమెత్రిన్ మందు కలిపి ఫాగింగ్ చేయించాలని సూచించారు. ఉదయగిరి సబ్‌యూనిట్ అధికారి ఎస్‌కే నౌషాద్ బాబు అందుబాటులో ఉంటారన్నారు. వైద్యసిబ్బంది కొండారెడ్డి, సైదా, ఖాజామొహిద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

వరికుంటపాడు: తమను బీఎల్వో విధుల నుంచి తొలగించాలని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ అబ్దుల్‌హమీద్‌ను కలిసి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు షంషీర్, కొండపనాయుడు, నారాయణ, ప్రసన్న, వెంకయ్యబాబు, మస్తానయ్య పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

వరికుంటపాడు: సచివాలయ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ విజయభాస్కర్‌రావు అన్నారు. మండలంలోని జి.కొండారెడ్డిపల్లి, పెద్దిరెడ్డిపల్లి సచివాలయాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ప్రతిరోజూ స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలని సూచించారు.

మూఢనమ్మకాలు వీడాలి



కావలి : బాలింతలు, గర్భిణులు మూఢనమ్మకాలను వీడి వైద్యుల సూచనలు పాటించాలని డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వెంగళరావునగర్ పీహెచ్‌సీలో డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు ఐరన్ సిరఫ్‌లు సోమవారం అందజేశారు. రామ్‌సెంటర్ డైరెక్టర్ తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాల కొండారెడ్డి, పీహెచ్‌సీ కమ్యూనిటీ ఆర్గనైజర్ ప్రసాద్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రజాసంకల్పయాత్ర చరిత్రాత్మకం



ఉదయగిరి: కేక్ కట్ చేసి పంచుతున్న ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి



బిట్రగుంట: ఎస్జీవీ కండ్రిగలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి

ఉదయగిరి: ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర చరిత్రాత్మక ఘట్టమని ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రను పూర్తిచేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక ట్యాంక్‌బండ్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద సోమవారం సంబరాలు నిర్వహించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్ కట్‌చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్ర ద్వారా రాష్ట్ర ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని , వారికి ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక 98 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన నవరత్న పథకాలతో అన్ని వర్గాల్లోని పేదలు ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శక పాలన సాగిస్తూ గడప గడపకు సంక్షేమ పథకాలను చేరవేస్తున్న జగనన్నను వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించడం ద్వారా రాష్ట్రాన్ని మరింతగా అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి, వరికుంటపాడు, కొండాపురం, కలిగిరి, దుత్తలూరు మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు అక్కి భాస్కరరెడ్డి, ఆంధ్రా బాలగురవారెడ్డి, సీహెచ్ రాజేంద్ర ప్రసాద్, కాటం రవీంద్రారెడ్డి, వాసిపల్లి వెంకటేశ్వరరెడ్డి, వరికుంటపాడు జెడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, కొట్టాలపల్లి సొసైటీ అధ్యక్షుడు కల్లూరి రమణారెడ్డి, సర్పంచ్‌లు గౌస్‌మెహిద్దీన్, వెంకటేశ్వరరెడ్డి, శ్యామలాకృష్ణారెడ్డి, తిరుపతి, కృష్ణ, ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ గడియాల్చి యస్దాని, ఎంపీటీసీ తిరుపతి, నాయకులు జీ ఓబుల్‌రెడ్డి, జీ వెంగళరెడ్డి, ఐ రమణయ్య, ఆర్ తిరుపతి, బాషా,, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంకల్పానికి...ప్రణామం

బిట్రగుంట: బోగోలు మండలం సుందరగిరివారి కండ్రిగలో ప్రజాసంకల్ప సంబరాలను ఘనంగా నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్ర పూర్తి చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. తొలుత దివంగత సీఎం వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాన్ని రావణ కాష్టం నుంచి రక్షించేందుకు జగనన్న చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర ప్రజల గుండెల్లో మర్చిపోలేని ఘట్టంగా నిలిచిపోయిందన్నారు. పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా చూసిన జగనన్న నవరత్న పథకాలను ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చిన మూడేళ్లలోనే 98శాతం హామీలను నెరవేర్చారని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయడం ద్వారా వైఎస్సార్‌సీపీ దేశంలోనే విలక్షణ పార్టీగా, ప్రజల పార్టీగా గుర్తింపు పొందిందని వివరించారు. పారదర్శక పాలన ద్వారా పేదలకు అండగా నిలవడంతో జగనన్నను ప్రతీ కుటుంబం తమ పెద్దకొడుకుగా భావిస్తుందన్నారు. ఎంపీపీ మేకల సుజాత, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిబోయిన వీరరఘు యాదవ్, మేకల శ్రీనివాసులు, సర్పంచ్‌లు ఉప్పాల మాచర్ల, బండ్ల సురేష్, బత్తల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంకల్ప యాత్రతో పేదల జీవితాల్లో వెలుగులు

వింజమూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర పేదల జీవితాల్లో వెలుగులు నింపిందని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రజాసంకల్ప పాదయాత్రను పూర్తి చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా బంగ్లాసెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రేవునూరు శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ మోహన్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు, నాయకులు మద్దూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, గణపం పెదమాలకొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వింజమూరు: వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



ప్రభుత్వ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: రాష్ట్రంలోని అన్ని వర్గాల్లోని పేదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. బోగోలు మండలం సుందరగిరి వారికండ్రిగలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం పథకాలను వివరించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చేపట్టాల్సి చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు వీలుగా ప్రభుత్వం సచివాలయ, వలంటీర్ వ్యవస్థలకు శ్రీకారం చుట్టిందన్నారు. వలంటీర్ల ద్వారా పేదలను క్షేత్రస్థాయిలో గుర్తించి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేస్తుండడంతో వారి జీవితాల్లో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయని వివరించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నూరు శాతం నెరవేర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకున్నా సంక్షేమ పథకాల అమల్లో సీఎం వైఎస్ జగన్ ఎక్కడా వెనుకడుగు వేయడం లేదన్నారు. ఎంపీపీ మేకల సుజాత, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, ఎస్జీవీ కండ్రిగ, జక్కేపల్లిగూడూరు, ఏబీ కండ్రిగ సర్పంచ్‌లు ఉప్పాల మాచర్ల, సురేష్, బత్తల శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిబోయిన వీరరఘు, మేకల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా పోలేరమ్మ జాతర

కావలి: అల్లూరు గ్రామదేవత పోలేరమ్మ జాతరను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం పోలేరమ్మ ఆలయం వద్ద ఆయన విలేకరులకు ఉత్సవ ఏర్పాట్లను వివరించారు. జాతరకు భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండడంతో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సహకారంతో భక్తుల రద్దీకి తగిన విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఉత్సవాల వివరాలు

10న ఉదయం స్వర్ణాభరణాలతో అమ్మవారి ప్రత్యేక దర్శనం, 6.30 గంటలకు అమ్మవారి గ్రామపూజ, 7గంటల నుంచి నిరంతర దర్శనం, 7.30 గంటలకు అమ్మవారి ఆచార చద్ది, 8 గంటలకు పోతురాజు వద్ద అమ్మవారి చద్ది నివేదన, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3 గంటల వరకు సంప్రదాయ పద్ధతిలో పోలేరమ్మ కథా కార్యక్రమం, సాయంత్రం 4.30 గంటలకు పోతురాజు వద్ద అమ్మవారి చద్ది, పానకాల కార్యక్రమం, 5 గంటలకు అమ్మవారి కుంభ కార్యక్రమం, రాత్రి 7 గంటలకు కలుగోళమ్మ పల్లకీసేవ, 7.30 గంటల నుంచి అమ్మవారి ముద్రగడ పావనం, రాత్రి 8 గంటలకు పురాతన సంప్రదాయానికి కొనసాగింపుగా గంగపెట్టె, వీరతాళ్లు, కత్తి ఆచార కార్యక్రమాలు నిర్వహించను వివరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, అమ్మవారి భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ



ఆత్మకూరు: పట్టణంలోని హిల్ రోడ్డు ప్రాంతానికి చెందిన నిరుపేద అల్లాభక్షు కుటుంబానికి ఎడ్నమ్మ మెమోరియల్ ట్రస్ట్ ట్రెజరర్ సుధీర్ చేయూతనందించారు. అల్లాభక్షు కేన్సర్ వ్యాధితో మంచానికే పరిమితమవడంతో కుటుంబం పస్తులు ఉంటోంది. ఈ విషయం తెలుసుకున్న సుధీర్ నిత్యావసర సరుకులు, దుప్పట్లను సోమవారం అందజేశారు.

వస్త్రాల పంపిణీ



ఆత్మకూరురూరల్: సంక్రాంతిని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న నాల్గో తరగతి ఉద్యోగులకు ఎంపీడీఓ శ్రీనివాసులు తన సొంత నిధులతో సోమవారం నూతన వస్త్రాలు అందజేశారు. ఈఓపీఆర్డీ ఉషారాణి, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, సాంకేతిక సహాయకుడు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



వింజమూరు: బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి



కావలి: పోటా పోటీగా తలపడుతున్న క్రీడాకారులు

వింజమూరు: యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి సందర్భంగా వింజమూరు బీసీ కాలనీ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. తొలుత బాలచౌడేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు శారరీక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు. ప్రభుత్వం క్రీడలకు ప్రోత్సాహాన్ని ఇస్తుందన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. క్రీడాకారులు స్నేహభావంతో వివాదాలకు తావులేకుండా క్రీడలు జరుపుకోవాలన్నారు. వింజమూరును మున్సిపాలిటీగా చేయడమే తన లక్ష్యమన్నారు. వింజమూరు అభివృద్ధికి నాయకుల సహకారం ఎంతో అవసరమన్నారు. ఎంపీపీ ఈ మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు రేవునూరు శ్రీనివాసులురెడ్డి, సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు, సీఐ సాంబశివరావు, ఎస్సై జంపానికుమార్, నాయకులు మద్దూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మద్దూరు చెన్నకృష్ణారెడ్డి, గణపం పెదమాలకొండారెడ్డి, గణపం చెన్నారెడ్డి, భోజనపు గోపి, గోవిందరెడ్డి, కృష్ణారెడ్డి, రొడ్డా కొండయ్య, కొండపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా క్రికెట్ పోటీలు

కావలి రూరల్ : పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డు జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న వైఎస్ జగనన్న క్రికెట్ టోర్నమెంట్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. సోమవారం జరిగిన తొలి మ్యాచ్‌లో చెన్నాయపాళెం లెవెన్స్‌పై ఒట్టూరు లెవెన్స్ 3 పరుగుల తేడాతో విజయం సాధించింది. 4 వికెట్లు సాధించిన వెంకయ్య మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ అందుకున్నాడు. రెండో మ్యాచ్‌లో ఏసీసీ లెవెన్స్‌పై అల్లూరు లెవెన్స్ విజయం సాధించింది. కేవలం 6 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీసిన రాజాను మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు వరించింది. మూడో మ్యాచ్‌లో దుర్గా లెవెన్స్‌పై కేపీ లెవెన్స్ విజయం సాధించింది. సాయి వెంకట్ మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు.

భూఆక్రమణదారులపై చర్యలకు వినతి



ఉదయగిరి: బిజ్జంపల్లి, లింగమనేనిపల్లి గ్రామాల్లోని పేదల భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని వారికి న్యాయం చేయాలని రైతు సంఘ నాయకుడు కాకు వెంకటయ్య కోరారు. ఈ మేరకు రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. 20 ఏళ్ల క్రితం ప్రభుత్వం పంపిణీ చేసిన భూముల్లో లబ్ధిదారులు జామాయిల్, తదితర పంటలు సాగుచేసుకుంటున్నారని తెలిపారు. ఇటీవల కొందరు పెత్తందారులు పేదల భూములను ఆక్రమించారని, లబ్ధిదారులు ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని ఆరోపించారు.

మాతృమూర్తి సేవా పురస్కారాల ప్రదానం



అల్లూరు: మేడా బుజమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాతృమూర్తి సేవా పురస్కారాలను సోమవారం ప్రదానం చేశారు. స్థానిక రామకృష్ణ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సీరియల్ నటి శివపార్వతి చేతుల మీదుగా అల్లూరుకు చెందిన బుల్లా ప్రసాద్‌రెడ్డి, కొప్పర్తి మల్లికార్జున బాబు, కటారి సాయికుమార్, నారా నాగభూషణం, పాపాల విజయకుమార్‌కు పురస్కారాలను అందజేశారు. నిర్వాహకులు మేడా మస్తాన్‌రెడ్డి, మేడా శివకుమార్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీదేవి పాల్గొన్నారు.

అధికారులు పనితీరు మార్చుకోవాలి



అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీపీ పద్మజారెడ్డి

అనుమసముద్రంపేట: అధికారులు పనితీరును మార్చుకోవాలని ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. మూడు నెలల క్రితం జరిగిన సర్వసభ్య సమావేశంలో అభివృద్ధి పనులపై అధికారులు చెప్పిన ఏ ఒక్క మాట నెరవేరలేదన్నారు. గ్రామాల్లో ఎక్కడా అభివృద్ధి కనిపించడం లేదన్నారు. ప్రజాప్రతినిధుల మాటలను అధికారులు లెక్కచేయడం లేదన్నారు. ప్రభుత్వం పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని చెబుతున్నా అధికారులు పనితీరులో విఫలమవుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ పథకాలు అధికారుల నిర్లక్ష్యంతో ప్రజల్లోకి వెళ్లడం లేదన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయకపోతే తాము గారమాల్లోకి ఎలా వెళ్లాలని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజవోలు సొసైటీ చైర్మన్ నారసింహారెడ్డి మాట్లాడుతూ వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై అందజేసిన విత్తనాలను పంటలు దెబ్బతినని రైతులకు ఎలా ఇచ్చారో చెప్పాలని ఏటను పట్టుబట్టారు. ప్రభుత్వం ఒకటి చెబుతుంటే అధికారులు మరొకటి చేసి చెడ్డ పేరు తీసుకొస్తున్నారని నిలదీశారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావు, అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నూరు శాతం పన్నులు వసూలు చేయాలి

ఉదయగిరి: పంచాయతీ కార్యదర్శులు నూరు శాతం ఇంటి పన్నులను వసూలు చేయాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని 17 పంచాయతీల పరిధిలో రూ.54.36 లక్షలు మేర పన్ను బకాయిలు ఉండగా, ఇప్పటి వరకు రూ.13.64 లక్షలు (25 శాతం) మేర మాత్రమే వసూలు చేయడం జరిగిందని చెప్పారు. మిగిలిన పన్ను బకాయిలను మార్చి నెలాఖరులోగా వసూలు చేయాలన్నారు. గృహ యజమానులు పన్నులు సకాలంలో చెల్లించి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఆవాజ్ రాష్ట్ర కమిటీలో ఆత్మకూరువాసి

ఆత్మకూరు: పట్టణానికి చెందిన పఠాన్ యస్దానిబాషా ఆవాజ్ రాష్ట్ర కమిటీ సెక్రటేరియేట్‌లో సభ్యుడిగా ఎన్నికయ్యారు. గుంటూరులో ఆది, సోమవారాల్లో జరిగిన ఆవాజ్ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర కమిటీలో సభ్యుడిగా తనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యస్దానికి పలువురు అభినందనలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సంగం: మండలంలోని కోలగట్ల సమీపంలోని పెన్నానది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో సెబ్ ఎస్సై అంజయ్య తన సిబ్బందితో కలిసి సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశారు.

కోడిపందేల స్థావరంపై దాడి

అల్లూరు: మండలంలోని పురిణిలో పైడేరు వాగు కట్టపై కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో కోవూరు సెబ్ ఇన్‌చార్జి సీఐ నరహరిరావు ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 3 కోళ్లు, 3 బైకులు, 1900 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్సైలు టీ శ్రీనివాసులు, డీ శ్రీధర్, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



సోమశిల: ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనల మేరకు గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రజలు విన్నవించిన సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని అధికారులు తెలిపారు. అనంతసాగరం మండలం ఆమనిచిరువెళ్ల, లింగంగుంట గ్రామ సచివాలయాల్లో వ్యవసాయశాఖ సలహా మండలి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఎంపీడీఓ మధుసూదన్, డీటీ ప్రదీప్ మాట్లాడుతూ అసైన్‌మెంట్ కమిటీకి భూమి లేని పేదలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. హౌసింగ్ ఏఈ ఉదయ్‌భాస్కర్ గృహ హక్కు పథకంపై అవగాహన కల్పించారు. వైకేపీ ఏసీ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

బీద రవిచంద్రకు విమర్శించే స్థాయి లేదు



మాట్లాడుతున్న బీద రమేష్‌బాబుయాదవ్

అల్లూరు: ఎంపీ బీద మస్తాన్‌రావును విమర్శించే స్థాయి టీడీపీ నేత బీద రవిచంద్రకు లేదని ఇస్కపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ఇస్కపల్లిలోని ఎంపీ బీద మస్తాన్‌రావు సోదరుడు బీద రమేష్‌బాబుయాదవ్ స్వగృహంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల కావలిలో చంద్రబాబునాయుడు రోడ్‌షో సందర్భంగా బీద రవిచంద్ర ఎంపీ బీద మస్తాన్‌రావును దుర్భాషలాడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీద రమేష్‌యాదవ్ మాట్లాడుతూ బీద మస్తాన్‌రావు అండదండలతో రాజకీయంగా, వ్యాపారపరంగా ఎదిగిన విషయాన్ని మరిచి విమర్శించడం తగదన్నారు. టీడీపీ బీద మస్తాన్‌రావును వాడుకుందే తప్ప, ఆయన ఏ రోజూ ఏదీ ఆశించకుండా రాజకీయాలు చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను చూసి వైఎస్సార్‌సీపీలో చేరిన బీద మస్తాన్‌రావు ప్రతిభను గుర్తించి రాజ్యసభ సీటు ఇచ్చి తగిన గౌరవం కల్పించారన్నారు. ఇకనైనా బీద రవిచంద్ర నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, లేకపోతే తరిమి తరిమి కొట్టే రోజులు దగ్గర్లోనే వస్తాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీపీ శశిరేఖ,సర్పంచ్ రంజిత్, నాయకులు కొండూరు శీనయ్య,దర్శిగంట వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్‌కు విశేష స్పందన



వినియోగదారుల సమస్యలను వింటున్న సభ్యులు

ఆత్మకూరు: పట్టణంలోని విద్యుత్‌శాఖ డీఈఈ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన విద్యుత్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. విద్యుత్ సంస్థ అధ్యక్షుడు, ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కే రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు ఎస్ఎల్ అంజనీకుమార్, నెల్లూరు ఏఎస్ఓ శ్రీనివాసరావు అదాలత్‌లో ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై అర్జీలు స్వీకరించారు. విద్యుత్ సిబ్బందితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి సూచనలు చేశారు. ఏపీరైతు సంఘం నాయకులు 2020లో సంభవించిన తుపాన్‌కు పొలాల్లో 132 కేవీ విద్యుత్ స్తంభాలు, తీగలు పడిపోయి పలువురు రైతులు వ్యవసాయ పనులు చేసుకోలేని పరిస్థితిపై వినతి పత్రం అందజేయగా, త్వరితగతిన తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రియదర్శినినగర్‌లో రోడ్డు మలుపులో ఇబ్బందికరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, ఆ ప్రాంతంలో పగటిపూట సైతం వెలుగుతున్న వీధిదీపాల సమస్యలపై పౌర సేవా హక్కుల సంఘం సభ్యుడు నోటి వెంకటేశ్వరరెడ్డి వినతి పత్రం అందజేశారు. మీటర్ రీడింగ్ ఒక్కరోజు ఆలస్యంగా తీసిన రీడింగ్‌లో తేడాతో ఆర్థిక భారం పడుతోందని పలువురు వినియోగదారులు విన్నవించగా, మీటర్ రీడర్లతో సమావేశం నిర్వహించి ప్రతి నెలా నిర్దిష్టమైన తేదీల్లోనే రీడింగ్ తీసేలా టైమ్‌టేబుల్ రూపొందించాలని ఆదేశించారు. సుమారు 15కుపైగా అర్జీలు అందాయని డీఈ జనార్దన్ తెలిపారు. ఏడీ సురేష్, ఏఈలు నరసింహారావు, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



పురిణి సభలో మాట్లాడుతున్న ఎంపీపీ శశిరేఖ

అల్లూరు: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు పంచాయతీ పాలకవర్గాలు చొరవచూపాలని ఎంపీపీ శశిరేఖ అన్నారు. మండలంలోని ఇస్కపల్లి, పురిణిలో గ్రామసభలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయాలు , రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జగనన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఎంపీడీఓ శ్రీదేవి, ఈఓపీఆర్డీ వీరేంద్ర, వైస్‌ఎంపీపీ వాసు, ఇస్కపల్లి, పురిణి సర్పంచ్‌లు రంజిత్, మైనంపాటి స్వాతి, నాయకులు బీద రమేష్, తాండ్ర మల్లికార్జున, కొండూరు శీనయ్య, దర్శిగుంట వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



రైతులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

కావలి రూరల్ : రైతులు లాభదాయకమైన ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రెయినర్ కళావతి అన్నారు. మండలంలోని కొత్తపల్లిలోని ఎర్ర మాల్యాద్రి ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో సోమవారం పొలంబడి నిర్వహించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు, మందులకు బదులుగా ప్రకృతి సిద్ధ రసాయనాలు వినియోగించడం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, శ్రీకాంత్, శ్రీహరి, శ్రీనివాసులు, జగదీష్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.